ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 18.06.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలు-ఏటీసీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు హైదరాబాద్ మల్లేపల్లి ఐటీఐలో శంకుస్థాపన చేస్తారు.
2. కేంద్ర జల్ శక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ఈ రోజు కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 17వ విడత ఆర్థిక సహాయం విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు.
3. NEET ప్రవేశ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని వివిధ విద్యార్థి సంఘాలు ఈ రోజు హైదరాబాద్ లో ఆందోళన చేపట్టాయి.
4. యోగాను ప్రతి ఒక్కరు దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పిలుపునిచ్చారు.

ఏటీసీలు-రేవంత్ రెడ్డి

ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలు-ఏటీసీలుగా మార్చాలని రాష్ట్రం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం హైదరాబాద్ మల్లేపల్లి ఐటీఐలో శంకుస్థాపన చేయనున్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. ఏటీసీల్లో ఏటా 15 వేల 860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల కోర్సుల్లో, 31 వేల 200 మందికి 23 రకాల స్వల్ప కాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తారు.

(పీఎస్)

కేంద్ర జల్ శక్తి. రైల్వే శాఖ సహాయ మంత్రి -కరీంనగర్ పర్యటన

కేంద్ర జల్ శక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వి సోమన్న ఈ సాయంత్రం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో పర్యటిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 17 వ విడత కిసాన్ సమ్మాన్ నిధి యోజన నగదు విడుదల చేసే కార్యక్రమం వారణాసి నుంచి ప్రారంభించనుండగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం లో ఏర్పాటు చేసిన దృశ్య మాధ్యమ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి సోమన్న ముఖ్య అతిథిగా హాజరు కానున్నరు. అధికారులు స్థానిక రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించిన తర్వాత వారిన ఉద్దేశించి సోమన్న ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ సీనియర్ శాస్త్రవేత్త ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు కార్యక్రమం

ఉంటుందని, ప్రధాని కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి రెండు భారీ ఎల్ ఈడీ తెరలు ఏర్పాటు చెసినట్లు తెలిపారు.

(పీటీసీ, కరీంనగర్)

పీఎం కిసాన్-నాగర్ కర్నూల్

కాగా, పీఎం కిసాన్ యోజన పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 16 విడతల్లో 19లక్షల 51వేల 727 మంది రైతులకు 519 కోట్ల రూపాయలు అందాయని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సాయంత్రం 17వ విడత నగదును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేస్తారని, ఇందులో భాగంగా జిల్లాలో ఒక లక్ష మంది రైతుల ఖాతాల్లో ఈ పథకం నగదు జమ అవుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం వల్ల చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు.

(PTC నాగర్‌కర్నూల్ జిల్లా)

సంజయ్, కిషన్ రెడ్డి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ రేపు, ఎల్లుండి కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గంలో పర్యటిస్తారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి కరీంనగర్ విచ్చేస్తున్న బండి సంజయ్ కుమర్ కు ఘన స్వాగతం పలికేందుకు పార్లమెంటు పరిధిలోని బీజేపీ శ్రేణులు సిద్దమయ్యాయి. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ తో పాటు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి రేపు రాష్ట్రానికి రావాలని భావించారు. అయితే రేపు సాయంత్రం కేంద్ర కేబినెట్ భేటీకి హాజరు కావాలని సమాచారం రావడంతో కిషన్ రెడ్డికి తన పర్యటనను మరుసటి రోజుకు వాయిదా వేసుకున్నారు. కాగా, బండి సంజయ్ రేపు ఉదయం కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని శనిగరం వద్దకు

చేరుకుంటారు. అక్కడ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతారు. మహాశక్తి, కొండగట్టు, వేములవాడ, సిరిసిల్ల మార్కండేయ ఆలయాలను దర్శించుకోనున్న సంజయ్ ఎల్లుండి మధ్యాహ్నం వరకు కరీంనగర్ లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

(పీటీసీ, కరీంనగర్)

కవిత-ములాఖత్

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయి జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఆ పార్టీ నేతలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ఈ రోజు  పరామర్శించారు. ఈ ఉదయం ఢిల్లీలోని తీహార్ జైలులో కవితతో ములాఖాత్ అయి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

(డెస్క్)

ఐపీఎస్ బదిలీల

రాష్ట్రంలో 28 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాల ఎస్పీలతోపాటు, హైదరాబాద్ తో సహ వివిధ జిల్లాలో పని చేస్తున్న పలువురు ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా జగిత్యాల, సూర్యాపేట, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్, వికారాబాద్, నల్లగొండ ఎస్పీలను బదిలీ చేశారు.

(డెస్క్)

BRS-విభజన అంశాలు:

రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా పరిష్కారం కాని పునర్ విభజన అంశాలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి V శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఈ ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నీళ్ళు, నిధులు, నియామకాల కోసం పోరాటం వల్లనే రాష్ట్రం ఏర్పడిందని, అయినా షెడ్యూలు 9, 10 ల్లో ఉన్న దాదాపు 130 సంస్థల అంశాలు పరిష్కారం కాలేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఆటంకాలు లేకుండా, మిగిలిన సంస్థల విభజన అంశాలను పరిష్కారం చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ పార్టీకి ముఖ్యమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

(MSL)

నీట్-విద్యార్థి సంఘాల ర్యాలీ

వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో అక్రమాలు జరిగాయని, ఈ ఏడాది నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు ఈ రోజు హైదరాబాద్ లో ఆందోళన చేపట్టాయి. ఎమ్మెల్సీ, NSUI రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ యుఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యుతో పాటు వాటి అనుబంధ యువజన విద్యార్థి సంఘాలు హైదరాబాద్ నారాయణగూడ నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించాయి. మాస్ కాపీయింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. మరోవైపు నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ బీఆర్ఎస్

అనుబంధ విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ నేతలు, కార్యకర్తలు రాజ్ భవన్ ముట్టడికి యత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

(డెస్క్)

ట్రాన్స్ జెండర్ల పెట్రోల్ బంక్-సిరిసిల్ల

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ట్రాన్స్ జెండర్స్ నిర్వహించే పెట్రోల్ బంక్ ను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మి రాజం తెలిపారు. దీన్ని త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ట్రాన్స్ జెండర్లకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు 3 కోట్ల రూపాయలతో జిల్లా కేంద్రంలో ఈ పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఎన్ వో సి పూర్తయిందన్నారు. బంక్ నిర్వహణపై ట్రాన్స్ జెండర్ లకు శిక్షణ కూడా పూర్తయిందన్నారు. ఈ బంక్ ద్వారా 15 మంది ట్రాన్స్ జెండర్లకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని వివరించారు.

(పి టిసి,రాజన్న సిరిసిల్ల జిల్లా)

యోగా-దామోదర రాజనరసింహ:

యోగా సాధన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య సమతుల్యతనిస్తుందని, యోగాను ప్రతి ఒక్కరు దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పిలుపునిచ్చారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 21న అన్ని పాఠశాలు, కళాశాలలో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ విభాగం హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో యోగా వాక్ ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యోగా ప్రపంచానికి మనదేశం ఇచ్చిన వరమని, మన పూర్వీకులు ఇచ్చిన గొప్ప చారిత్రక సంపద అని పేర్కొన్నారు. యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ

భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్ విభాగం కమిషనర్ ప్రశాంతి, డైరెక్టర్ పాణి కిరణ్ సహా పలువురు అధికారులు, నేచురోపతి, హోమియోపతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

(MSL)

యాదాద్రి-గిరి ప్రదర్శన

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ ఈ రోజు తిరిగి ప్రారంభమైంది. యాదగిరీశుడి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి గిరి ప్రదక్షిణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ తెల్లవారుజామున కొండకింద గాలిగోపురం వద్ద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

(డెస్క్)